## ఆదివాసీ గూడేల్లో దండారీ సంబురాలు



ఉట్నూర్‌రూరల్: దండారీ పూజలు చేస్తున్న ఎంపీపీ, గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 6: దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని ఆదివాసీ గూడేల్లో దండారీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మత్తడి గూడ గ్రామంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ గ్రామస్తులతో కలిసి ఏత్మాసూర్ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమలో గ్రామ పటేల్ సిడాం సోనేరావ్, రాంషావ్, ఆనంద్‌రావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, నవంబర్ 6 : మండలంలోని డోంగర్ గావ్ గ్రామంలో దండారీ ఉత్సవాలకు సంబంధించిన వస్తువులకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి భోగి పండుగ చేసుకున్నారు. ఆదివాసీ గ్రామాల్లో వారం పాటు దండారీ ఉత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. కార్యక్రమంలో బాదు పటేల్, ఆర్క సెడ్మ మహాజన్, బండు, పెందూర్ లింబారావ్, లచ్చు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం పరిశీలన

నిర్మల్ టౌన్, నవంబర్ 6 : నిర్మల్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనం దగ్గరలో గల ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్స్, సామగ్రి గోదాముల్లో నిల్వ ఉండడంతో వాటిని పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

# బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ యువకులు

నేరడిగొండ, నవంబర్ 6 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం వడూర్ గ్రామానికి చెందిన బీజేపీ యువకులు సోమవారం బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన కిశోర్, నాని, నరేశ్, విద్యాసాగర్, రోహిత్‌తో పాటు 50 మంది యువకులు పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి జాదవ్ అనిల్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు కూడ బీఆర్‌ఎస్ పార్టీని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు మరిచిపోలేక పోతున్నారని తెలిపారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ యువకులతో జాదవ్ అనిల్

ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని వెల్లడించారు. తనపై నమ్మకంతో యువకులు పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నేతలు



కాంగ్రెస్ సీనియర్ నేతకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న

ఎదులాపురం, నవంబర్ 6 : కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు హమీద్ ఖాన్, ఫైజుల్లఖాన్ ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ చేరిన సీనియర్ నేతలకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాహితం కోసం పాటు పడుతున్న బీఆర్‌ఎస్‌కు మంచి స్పందన లభిస్తోందన్నారు. అందుకు అనుగుణంగానే పార్టీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 6 : నిర్మల్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేదని కటాక్షములు సిద్ధించుట వంటి పండుగ అని అన్నారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.



వేడుకల్లో పాల్గొన్న నరేందర్ రెడ్డి

# ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలి

- **ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

ఎదులాపురం, నవంబర్ 6 : సీ-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించినచో ప్రజలు సీ- విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. బాధ్యతాయుత పౌరుని చేతిలో బ్రహ్మాస్త్రం సీ-విజిల్ యాప్ అని, ఇందులో ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయడం, నగదు, వస్తువులు, మద్యంద్రవ్యాలు పంపిణీ చేయడం, ప్రజల ఆస్తులను అనుమతి లేకుండా ప్రచారాలకు వినియోగించడం, కుల మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, ఓటర్లను రవాణా, అసత్య వార్తల ప్రసారం, చెల్లింపు వార్తలు ప్రచురణ, మరణాయుధాలు కలిగి ఉండడం ఇతర ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను వెంటనే సీ-విజిల్‌లో అప్‌లోడ్ చేయడంతో నిర్ణీత కాల వ్యవధిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం ఆ ప్రాంతానికి చేరుకొని విచారణ జరిపి వంద నిమిషాలలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై ఈడీఎం రవి కుమార్ పవార్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బుగుప్తా, శ్యామలాదేవి, ఈడీఎం రవి, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, సెక్టోరియల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్



కొండల్‌రావ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

## జాదవ్ కొండల్‌రావ్‌కు నివాళి

ఉట్నూర్ రూరల్, నవంబర్ 6: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం చీమానాయక్ తండాకు చెందిన జాదవ్ కొండల్‌రావ్ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం నిర్వహించిన తెరివి కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ హాజరై కొండల్‌రావ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్, సర్పంచ్ మధుకర్, రెడ్డి నాయక్, జాదవ్ హరి, చంద్రశేఖర్, నారాయణ నాయక్, ఈఈ భీంరావ్, రాంకిషన్‌నాయక్, కపిల్ జాదవ్, బానోత్ రామారావ్, జమునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిని మార్పు చేస్తే ఖబడ్దార్



ఎదులాపురం: మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్

ఎదులాపురం, నవంబర్ 6 : బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వన్నెల అశోక్‌ను మార్చినట్లయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వెంటనే ప్రకటన చేయకుంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పార్టీ అభ్యర్థులను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మావల మండలాధ్యక్షుడు ఆత్రం గణపతి, ప్రధాన కార్యదర్శి ముకుంద్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, దినేశ్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అభ్యర్థిని మార్చితే ఊరుకునేది లేదు

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 6 : బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వన్నెల అశోక్ బీఫామ్ ఇవ్వకపోతే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కంచం లక్ష్మణ్, మైనార్టీ చైర్మన్ రంజాన్ అన్నారు. సోమవారం సిరికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన వన్నెల అశోక్ బీఫామ్ ఇవ్వాలని ఎలాంటి మార్పులు చేర్పులు చేయరాదని డిమాండ్ చేశారు.

**ఇచ్చోడలో..**

బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని సిరిచెల్మ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్నెల అశోక్‌కు బీఫామ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు సుదర్శన్ గౌడ్, లచ్చన్న, రాజేశ్వర్, శ్రీధర్, రవి పాల్గొన్నారు.

భీంపూర్, నవంబర్ 6 : బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను ఖరారు చేయకుంటే సోమవారం భీంపూర్ మండలం గుంజాల, మర్కాగూడలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారే. వన్నెల అశోక్‌కే బీఫాం ఇవ్వాలని నాయకులు సోయం కాంతారావు, రామేశ్వర్ డిమాండ్ చేశారు.

## 20 నుంచి ఆర్టీసీ హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 6 : ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో ఆధ్వర్యంలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఈ నెల 20 నుంచి ప్రారంభించనున్నామని డిపో మేనేజర్ కల్పన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఫీజు రూ.15600 ఉంటుందని, అభ్యర్థులు లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.